ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలయ్యేనా..?



- ఏళ్లు గడుస్తున్నా అమలుకు నోచుకోని పరిస్థితి
- మధ్యాహ్నం ఆకలితో అలమటిస్తున్న విద్యార్థులు
- అమలు చేస్తే పేద విద్యార్థులకు తప్పనున్న అవస్థలు

బెజ్జూరు, సెప్టెంబరు 14: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినా అమలుకు నోచుకోలేదు. దీంతో కళాశాలలకు వచ్చే విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తూ అధ్యాపకులు చేప్పే పాఠాలు అర్థం కాక మిన్నకుండి పోతున్నారు. ఉదయం ఇంట్లో తిన్న ఆహారమే తప్ప కళాశాలకు వచ్చిన విద్యార్థులకు ఎలాంటి సదుపాయం లేక పస్తులుంటున్నారు. మండలాల వారీగా ఒకే కళాశాల ఉండటంతో వివిద ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. దీంతో ఆకలితో అలమటిస్తూ చదువుపై దృష్టి సారించలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హామీ కేవలం ప్రకటనలకే పరిమితం కాగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా మధ్యాహ్న భోజనాన్ని అమలయ్యే చూడాలని అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు కోరుతున్నారు.

నాలుగేళ్ల క్రితం ప్రకటన..

సాధారణంగా గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అప్పటివరకు బాగానే ఉన్నా పట్టణాల్లోని ప్రభుత్వకళాశాలల్లో అడుగు పెట్టగానే భోజనం విషయంలో ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోంది. బయట హోటల్‌లో భోజనం చేసే స్థోమత లేక ఆకలితో అలమటిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు చేస్తామంటూ అప్పటిప్రభుత్వం నాలుగేళ్ల క్రితం ప్రకటించినా అమలు కాలేదు. అప్పటి మంత్రివర్గ సమావేశంలోనూ ఇందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకున్నా ఇప్పటివరకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాకపోవడంపై విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అమలు చేస్తే మెరుగైన ఫలితాలు..

ఈ పథకం అమలు చేస్తే కళాశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెరిగే అవకాశం ఉంటుంది. ఉత్తీర్ణత పెరిగేందుకు వీలుంటుంది. పౌష్టికాహారం అందడంతో చదువుపై దృష్టిసారిస్తారు. భవితకు బాటలు వేసుకుంటారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చే విద్యార్థులు ఆకలితో చదువుపై దృష్టిసారించలేని పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా 11ప్రభుత్వ కళాశాలలుండగా, ఇందులో జిల్లావ్యాప్తంగా సుమారు ఐదు వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ఎక్కువమంది పేద వర్గాలకు చెందిన వారే ఉన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో ఫీజుల భారం భరించే స్థోమత లేకపోవడంతో ప్రభుత్వ కళాశాలల్లో చేరుతున్నారు. జిల్లాలో కొంతమంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చదువుతుండగా మరి కొందరు గురుకులాలు, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్నారు.



బెజ్జూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

గత హామీ నెరవేరేనా?

అప్పటి సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు. కళాశాలల్లో విద్యార్థులు పస్తులు ఉండకూడదన్న ఉద్దేశ్యంతో ఏర్పాటు చేయించారు. ఈ పథకంలో నాలుగు నెలల పాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేవారు. అప్పటి ఎమ్మెల్యే కోనప్ప స్ఫూర్తితో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్ని ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తామని స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో అధిక ఫలితాలు కూడా సాధించారు. ప్రభుత్వం ప్రకటించి నాలుగేళ్లు కావస్తున్నా ఇప్పటికీ అమలు కాలేదు. ఇప్పటివరకు ఈ పథకంపై ఎలాంటి ప్రకటన విడుదల చేయడం లేదు. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతంతో గతంలో ఇచ్చిన హామీపై ప్రస్తుతం స్పష్టత లేకుండాపోయింది. ఈ ప్రభుత్వమైనా కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. అయితే ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్నబియ్యం ఇస్తామని ప్రకటించగా మధ్యాహ్నభోజనం పథకం కూడా ఏర్పాటు చేస్తారేమోనని విద్యార్థులు భావిస్తున్నారు. ప్రభుత్వం పేద విద్యార్థుల ఆకలి కేకలు దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తే బాగుంటుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్న విధంగానే కళాశాలల్లో అమలు చేస్తే రాష్ట్రంలోని పేద విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

అమలు చేస్తే బాగుంటుంది..

రామడుగుల సంజయ్, ఇంటర్ ప్రథమ సంవత్సరం, బెజ్జూరు



ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తే బాగుంటుంది. కళాశాలలకు వెళ్తే పస్తులుండాల్సిన పరిస్థితులున్నాయి. దీంతో ఆకలితో చదువుపై దృష్టి సారించలేక పోతున్నాం. ప్రభుత్వం స్పందించి ఈ పథకాన్ని అమలు చేయాలి. కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఆదివాసీల అరెస్టులు ఆపాలి

- నిందితుడికి ఉరిశిక్ష విధించాలి



ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 14: జైనూరు ఘటనపై ఆదివాసీల అరెస్టులను వెంటనే ఆపాలని కోరుతూ శనివారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ఆదివాసీసంఘాల నాయకులు విన్నవించారు. అనంతరం వారు విలేకరులతోమాట్లాడారు. జైనూరులో ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం, హత్యాయత్నంకు పాల్పడిన మానవమృగం మక్దుంకు ఉరి శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగి చాలా రోజులు అవుతున్నా నిందితుడిపై ఎలాంటి కేసులు నమోదు చేశారో తమ దృష్టికి తీసుకురాలేదన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించకుంటే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏజెన్సీప్రాంతాల్లో ఆదివాసీచట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్సుకోల సరస్వతి, ఆదివాసీ సంఘాల నాయకులు పోచయ్య, శ్రీనివాస్, గుణవంతరావు, మోతీరాం తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి: ఎస్పీ

ఆసిఫాబాద్, సెప్టెంబరు 14: జిల్లాలో గణేష్‌విగ్రహాల నిమజ్జనాన్ని సజావుగా ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఊరేగింపు వాహనాలు, విగ్రహాల ఎత్తుకుతగ్గట్టుగా నిర్దేశితమార్గాల్లో వెళ్లాలని సూచించారు. ఊరేగింపు మార్గాల్లో రద్దీని తగ్గించాలని అధికారులను ఆదేశించారు. ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదన్నారు. ఎవరైనా డీజేలను వినియోగిస్తే సీజ్‌చేసి వారిపై కేసు నమోదుచేస్తామని తెలిపారు. విగ్రహాన్నితీసుకెళ్లే వాహనంలో మద్యం, మద్యం తాగిన వ్యక్తులను అనుమతించరాదన్నారు. ఊరేగింపుల్లో కర్రలు,కత్తులు, మారణాయుధాలు తీసుకెళ్లరాదన్నారు. పోలీసుశాఖ సూచనలు పాటించాలని, ఏదైనా అత్యవసరపరిస్థితి ఏర్పడితే డయల్100కు కాల్ చేయాలన్నారు.

'అక్రమ అరెస్టులు సరికాదు'

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 14: జైనూరు మండలంలో ప్రజలను పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులను అరెస్టుచేసి పోలీసుస్టేషన్‌కు తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే అక్రమఅరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్‌పాలనలో పోలీసుల రాజ్యం నడుస్తుందని పోలీసు యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని ప్రభుత్వం నడు పుతున్న రేవంత్ సర్కార్‌కు త్వరలోనే ప్రజలు బుద్ధిచెబుతారని రాబోయే రోజుల్లో బీజేపీప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీనాయకులు ఆంజనేయులు, సునీల్ చౌదరి, విశాల్, బాలకృష్ణ, సంజీవ్, రమేష్‌గౌడ్, వెంకటేష్, శ్రీనివాస్, సుభాష్, జయరాజ్, నవీన్‌గౌడ్, ఆనంద్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


కళాశాల, వసతిగృహాల ఏర్పాటుకు చర్యలు: కలెక్టర్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 14: వచ్చే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ బీఎస్సీనర్సింగ్ విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా కళాశాల, వసతిగృహాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. శనివారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలకేంద్రంలో ప్రభుత్వ బీఎస్సీ నర్సింగ్‌కళాశాల, వసతిగృహాల ఏర్పాటుకు ప్రతిపాదితభవనాలను పరిశీలించామని తెలిపారు. వచ్చేవిద్యా సంవత్సరం నర్సింగ్ విద్య అభ్యసించే విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో టీఎంఐడీసీడీఈ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కాగజ్‌నగర్ డీఎస్పీగా బి రామానుజం



బాధ్యతలు స్వీకరిస్తున్న రామానుజం

కాగజ్‌నగర్, సెప్టెంబరు 14: కాగజ్‌నగర్ డీఎస్పీగా బి రామానుజం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సదయ్యను హైదరాబాద్ ఐజీ కార్యాలయానికి అటాచ్‌చేశారు. జైనూరులో జరిగిన అల్లర్లను నియంత్రించటంలో విఫలమయ్యారన్న ఆరోపణలతో ఆయనను బదిలీ చేశారు.

'పెండింగ్ వేతనాలు ఇవ్వాలి'

ఆసిఫాబాద్, సెప్టెంబరు 14: పెండింగ్‌వేతనాలు ఇవ్వాలని శనివారం జిల్లాకేంద్రంలోని సీహెచ్‌సీలో పనిచేస్తున్న శానిటేషన్,సెక్యూరిటీ,పేషంట్‌కేర్ కార్మికులు పట్టణంలోని అంబేద్కర్‌విగ్రహానికి వినతిపత్రంఅందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మల్లేష్, మురళీ, హరీష్, మమత, నీల, గుణవంతరావు, గంగన్న పాల్గొన్నారు.



'ఉద్యోగుల జీతాల నుంచి బేసిక్ కట్ చేయవద్దు'

మందమర్రి టౌన్, సెప్టెంబరు 14: వరద సహాయానికి వేతనాల నుంచి ఒక్కరోజు బేసిక్ కట్ చేయకూడదని ఏరియాలోని కేకే5గని కార్మికులు మేనేజర్‌ప్రవీణ్‌కు వినతిపత్రం సమర్పించారు. అంతకుముందు వారు తమ జీతాల నుంచి ఎలాంటి కోతలను రికవరీ చేయవద్దని నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కార్మికులంతా సంతకాలు చేశారు. కార్మికులు మాట్లాడుతూ గనులవద్ద బాక్సులు ఏర్పాటు చేయాలని, తమకు తోచిన విధంగా సహాయం చేస్తారని, దీనిపై కార్మికసంఘాలు స్పందించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని తెలిపారు. దీనిపై స్పందించిన మేనేజర్ ఈ విషయాన్ని తమ పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

సీఎస్ఆర్ నిధుల నుంచి సహాయమందించాలి

శ్రీరాంపూర్: వరదబాధితులకు సీఎస్ఆర్ నిధులనుంచి సహాయమందించాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి ఒకప్రకటనలో కోరారు. ఇటీవల కురిసిన భారీవర్షాలతో ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. అలాంటి వారికి సింగరేణి సీఎస్ఆర్ నిధుల నుంచి సహాయం చేయాలన్నారు. అంతేకాని కార్మికుల వేతనాల నుంచి రికవరీ చేయవద్దని సూచించారు.

గణపతి పూజల్లో పాల్గొన్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన, సెప్టెంబరు 14: గోలేటి పద్మశాలి వెల్ఫేర్‌సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుడివద్ద శనివారం సింగరేణి జీఎం శ్రీనివాస్ పూజలు నిర్వహించారు. ఆయనవెంట అధికారులు రాజమల్లు, జాడే, తిరుపతి, శ్రీనివాస్, బెహర, యూనియన్ నాయకులు తిరుపతి, పేరం శ్రీనివాస్, ఎస్.ప్రకాష్, మల్రాజు శ్రీనివాస్, పద్మశాలి సేవాసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, గోలేటి పద్మశాలి వెల్ఫేర్ సొసైటీకమిటీ సభ్యులు, తదితరులున్నారు.

నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేయాలి: సీఎండీ

శ్రీరాంపూర్/మందమర్రి టౌన్, సెప్టెంబరు 14: విద్యుత్‌కేంద్రాలకు నిరంతరాయంగా బొగ్గుసరఫరా చేయాలని సింగరేణిసీఎండీ ఎన్‌బలరామ్ అన్నారు. అన్ని ఏరియాల్లోని జీఎంలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షాసమావేశం నిర్వహించారు. రోజుకుకనీసం 14లక్షల క్యూబిక్‌మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలన్నారు. రాష్ట్ర విద్యుత్ అవసరాల దృష్ట్యా మూడునెలల్లో వర్షాలతో కోల్పోయిన ఉత్పత్తి నష్టాన్ని భర్తీచేసేందుకు కృషిచేయాలన్నారు. రోజుకు కనీసం 2లక్షలటన్నుల బొగ్గును ఉత్పత్తిచేయాలని ఆదేశించారు. కొత్తగూడెంలోని వీకేఓసీపీ తొలిదశ అటవీఅనుమతులు లభించినందున రెండు నెలల్లో బొగ్గుఉత్పత్తికి కావాల్సిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సంస్థడైరెక్టర్లు సత్యనారాయణ(ఈఅండ్‌ఎం), జి వెంకటేశ్వర్ రెడ్డి (ప్రాజెక్ట్స్, ప్లానింగ్‌అండ్‌పా), జీఎం (కోఆర్డినేషన్) సుభాని, జీఎం(సీపీపీ) జక్కంరమేష్, వివిధ ఏరియాల జీఎంలు, ఇతరఅధికారులు పాల్గొన్నారు.

యాజమాన్యం కావాలనే కాలయాపన చేసింది: ఏఐటీయూసీ

మందమర్రి టౌన్, సెప్టెంబరు 14: గుర్తింపు హోదాపత్రం ఇవ్వకుండా యాజమాన్యం కావాలనే కాలయాపన చేసిందని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్‌సెక్రెటరీ వైవీరావు అన్నారు. శనివారం యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గుర్తింపుపత్రం ఇవ్వకపోవడం మూలంగా మైన్స్ సేఫ్టీ కమిటీ సమావేశాలు నిర్వహించలేదని తెలిపారు. ప్రస్తుతం గుర్తింపుపత్రం ఇచ్చిన నేపథ్యంలో సమావేశాలు నిర్వహించి కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపనున్నామని తెలిపారు. సమావేశంలో నాయకులు కేంద్రకమిటి కార్యదర్శి ఎండీ అక్బర్‌అలీ, సలేంద్ర సత్యనారాయణ, భీమనాథుని సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

జీఎంకు సన్మానం

రెబ్బెన, సెప్టెంబరు 14: బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాసచారిని గోలేటి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘంసభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా సంఘం అధ్యక్షుడు పాంచాలపు లక్ష్మణాచారి, ప్రధానకార్యదర్శి నల్లగొండ సదాశివచారి, సంఘం నాయకులు ఉప్పుల నరసింహచారి, కిషన్‌చారి, వెంకటేశం చారి, రామకృష్ణచారి, చాకటి అశోక్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

- ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన, సెప్టెంబరు 14: బెల్లంపల్లి ఖైరిగూడలో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించేందకు కృషి చేస్తామని ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. శనివారం ఈపీ ఆపరేటర్లతో ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో సమావేశం జరిగింది. కార్యక్రమంలో పిట్‌కార్యదర్శి మారం శ్రీనివాస్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ వివీరావు, గోలేటి బ్రాంచ్‌కార్యదర్శి ఎంఆర్‌సి రెడి, తదితరులు పాల్గొన్నారు.

ఓసీలో పనిచేస్తున్న కార్మికులకు హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలి

- హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్

మందమర్రి టౌన్, సెప్టెంబరు 14: మందమర్రి ఏరియాలోని మందమర్రి, రామకృష్ణాపూర్ ఓసీల్లో పనిచేస్తున్న కార్మికులకు హెచ్‌ఆర్ఏ చెల్లించకుండా యాజమాన్యం చోద్యం చూస్తోందని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన మందమర్రిలోని సీఏహెచ్‌పీలో మాట్లాడుతూ ఆర్కేపీ క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోకి వస్తుందని, కేకే ఓసీ, సీఎస్‌పీ, ఏరియా ఆసుపత్రి, రెస్క్యూ, వర్క్‌షాపులో పనిచేసే కార్మికులకు మున్సిపాలిటీ ఉన్నందున హెచ్‌ఆర్ఏ ఎందుకు చెల్లించడం లేదన్నారు. మందమర్రిలో కూడా అదే పరిస్థితి నెలకొందన్నారు.

కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలి

- ఏఐటీయూసీ ఉపప్రధాన కార్యదర్శి కందికట్ల

శ్రీరాంపూర్, సెప్టెంబరు 14: కార్మికులకు మౌలికవసతులు కల్పించాలని ఏఐటీయూసీ ఉపప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా అన్నారు. శనివారం వారు ఆర్కే5 గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. వేలకోట్ల రూపాయలు లాభాలు పొందుతున్న సింగరేణి కార్మికులకు రెస్ట్‌షెల్టర్లు, తాగునీరు, ఇతరవసతులు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. అనంతరం కార్మికులు తెలిపిన సమస్యలను మేనేజర్ అబ్దుల్‌ఖాదిర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏరియాకార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, పిట్‌కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 14: రామకృష్ణాపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఏ జోన్ సివిక్, సీహెచ్‌పీ రైల్వే సైడ్‌కాంట్రాక్టు కార్మికులు, సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. శనివారం సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల అడ్డాల వద్ద వేతనాల పెంపున కోసం పోరు బాట కరపత్రాలను విడుదలచేశారు. ఈ సందర్భంగా ఏరియా అధ్యక్షకార్యదర్శులు మాట్లాడుతూ సింగరేణిలో పనిచేస్తున్న వివిధ విభాగాల కాంట్రాక్టుకార్మికుల వేతనాలు పెంచడంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మొండిగా వ్యవహరిస్తున్నాయన్నారు.

దీనివలనపెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు రాకపోవడంతో కార్మి కులు ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రప్రభుత్వం కనీసవేతనాల జీవోలనుసవరించక పోవడం, కొత్తజీవోలను ఇవ్వకపోవడంవల్ల కార్మికుల వేతనాలు పని బారెడు వేతనం మూరెడనే చందంగా ఉందన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వాలు కనీసవేతనాలు జీవోలను విడుదలచేసి సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో సివిక్, రైల్వే సైడ్‌కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

బీసీ సంఘాలు సంఘటితం కావాలి

మందమర్రి టౌన్, సెప్టెంబరు 14 : జిల్లాలోని బీసీకులాలను సంఘటితం చేయడమే లక్ష్యంగా అన్నికులాల అధ్యక్షులుపనిచేయాలని బీసీ సంఘాల నాయకులు లక్ష్మణ్, రాజిరెడ్డి, సుధాకర్, మాయ రమేష్‌లు తెలిపారు. శనివారం కృష్ణ ఫంక్షన్‌హాల్‌లో బీసీ కులసంఘాల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కులగణన చేపట్టిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు. అన్నిసంఘాల అధ్యక్షులు సభ్యులసభ్యత్వం నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. సంఘాలనాయకులు కొత్తపల్లి సత్యనారాయణ, నల్వల సమ్మయ్యయాదవ్, వేణుగోపాల్ గౌడ్, మోహన్, శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్, రవి, రాంచందర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌కు స్టార్టర్ ఏర్పాటు చేసిన అధికారులు

భీమారం, సెప్టెంబరు 14: మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో కొంతకాలంగా మంచినీటి పథకం బోరు మోటారు స్టార్టర్ చెడిపోయి కాలనీ వాసులు తాగునీటికి, ఇతర అవసరాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు శుక్రవారం ఖాళీ బిందెలతో నిరస వ్యక్తం చేశారు. నీటి సమస్యను ఆంధ్రజ్యోతిలో ప్రచురించగా అధికారులు స్పందించారు. మోటారు పని చేసేలా స్టార్టర్‌ను ఏర్పాటు చేశారు. నీటిసమస్య తీరడంతో కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



నీరు పట్టుకుంటున్న ప్రజలు

ప్రెస్‌క్లబ్ కార్యవర్గానికి సన్మానం

దండేపల్లి, సెప్టెంబరు 14: మేదరిపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఆల్‌ఇండియా అంబెద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మండల ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని శనివారం సన్మానించారు. కార్యక్రమంలో కొల్లూరి రవికుమార్, దూటసాయికుమార్, ప్రశాంత్, కోడి రాజేష్‌సురేష్, దినేష్, దుర్గప్రసాద్, పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సరుకులు అందజేత

మందమర్రి టౌన్, సెప్టెంబరు 14: పట్టణంలోని 2వ జోన్ భాగ్యనగర్ కాలనీకి చెందిన మాల మహానాడు నాయకులు కె రాజం ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబానికి శనివారం మాలమహానాడు నాయకులు పదివేల రూపాయల ఆర్థికసహాయం, సరుకులు అందజేశారు. నాయకులు లక్ష్మణ్, రాములు మాట్లాడుతూ బతికి ఉన్నంత కాలం సమాజ సేవతోపాటు సంఘం అభివృద్ధికి పనిచేసిన నాయకుడు రాజం అని కొనియాడారు. నాయకులు బి రవి, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

దండేపల్లి, సెప్టెంబరు 14: విద్యార్థుల్లో మేథాశక్తిని పెంపొందించేదుకే వ్యాస రచన పోటీలు ఎంతో దోహదపడుతాయని శివపావని ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు కోండు జనార్దన్ అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దండేపల్లి రామాలయంలో శనివారం విద్యార్థులకు రామాయణంపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యాగండ్ల గంగన్న, మల్లూరి వినోద్‌కుమార్, కార్యదర్శి ఉదయశ్రీనివాస్, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

మందమర్రి టౌన్, సెప్టెంబరు 14 : పట్టణంలోని రెండో జోన్‌కు చెందిన ఇప్ప వెంకటేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో విషయం తెలుసుకున్న ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ నాయకులు ఆయనఇంటికి వెళ్లి నిత్యవసర సరకులు, 5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వెంకటస్వామి, అశోక్‌కుమార్, బద్రి సతీస్, మణిరాజ్, సుజిత్, శ్రీకాంత్, సురేందర్, సది, అశోక్‌రెడ్డిలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


నర్మెట సందీప్ (ఫైల్)

భీమారం, సెప్టెంబరు 14: పోలంపల్లి గ్రామానికి చెందిన నర్మెట సందీప్ (22) అనే యువకుడు గత నెల 19న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తల్లి అనారోగ్యానికి గురికాగా మనస్తాపం చెందిన సందీప్ మద్యం మత్తులో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాలకు తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం వరంగల్ తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని పేర్కొన్నారు. మృతుడి తండ్రి సురేష్ ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాములు పేర్కొన్నారు. సందీప్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా అతడి తల్లి మంజుల ఇంటి వద్ద అనారోగ్యంతో మృతి చెందింది. ఒకే ఇంట్లో 20 రోజుల్లో ఇద్దరు మృతి చెందడంతో విషాదం నెలకొంది.

నస్పూర్‌లో దొంగతనాలు

నస్పూర్, సెప్టెంబరు 14 : నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వార సంత సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాల, తెలంగాణ తల్లి చౌరస్తా లోని ఓ వైన్స్‌లో శనివారం తెల్లవారుజామున దొంగలుపడ్డారు. పాఠశాల ముందు భాగంలోని గోడను దూకి లోపలికి ప్రవేశించి రెండు బీరువాలు పగులగొట్టారు. బీరువాల్లోని రూ.15వేల వరకు ఎత్తుకెళ్లారని పాఠశాల ప్రిన్సిపాల్ ప్రమోద్ తెలిపారు. తెలంగాణ తల్లి చౌరస్తాలోని వైన్స్‌లో వెనుక నుంచి తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. కౌంటర్‌లో ఉన్న సుమారు 20వేలను ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం చూసి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండు చోట్ల క్లూస్ బృందం ఆధారాలను సేకరించింది. పోలీసులకు బాధితులు పిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కస్తూర్బాలో హిందీ దివస్


వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

దండేపల్లి, సెప్టెంబరు 14: హిందీ భాష అభివృద్ధికి ప్రతీ పౌరుడు కృషి చేస్తూ దేశీయ భాషలను కాపాడుకోవాలని కేజీబీవీ ఎస్‌వో మంజుల అన్నారు. దండేపల్లి విద్యాలయంతోపాటు పలు ప్రైవేటు విద్యాసంస్థలలో శనివారం హిందీ దివస్ వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. మాతృభాష అయిన తెలుగుతోపాటు హిందీ చదవడం, మాట్లాడడం నేర్చుకోవాలన్నారు. బాలికలు హిందీ ప్రసంగంపై నాటికలు, వేషధారణ, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలను రక్షించాలి



నిరసన తెలుపుతున్న పీడీఎస్ నాయకులు

లక్షెట్టిపేట రూరల్, సెప్టెంబరు 14: లక్షెట్టిపేట పట్టణ, మండలంలోని చెరువులు కుంటలను కబ్జాదారుల నుంచి రక్షించాలని డిమాండ్ చేస్తూ పీడీ ఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభంజనం మాట్లాడుతూ మండలంలో చెరువులు, కుంటలు అక్రమణదారుల కోరల్లో ఉన్నాయని వాటి ని కబ్జాదారుల నుంచి కాపాడాలన్నారు. చెరువులకు, కుంటలకు, మత్తడి లెవల్‌కు ఎల్‌టీఎఫ్, బఫర్ జోన్లకు సరిహద్దులను ఏర్పాటు చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చెరువులకు శాశ్వత బండలతో రివిట్‌మెంట్ చేసి పటిష్ట నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఆకాష్ మండల్, బి. అరుణ్, రవీందర్, యోగేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో ఒకరి మృతి

- ఓరియంట్ సిమెంట్ కంపెనీలో ఘటన
- మరొకరి పరిస్థితి విషమం


మాట్లాడుతున్న కుటుంబ సభ్యులు, ఆదివాసీ నాయకులు (ఇన్‌సెట్‌లో) చేదం నవీన్ (ఫైల్)

కాసిపేట, సెప్టెంబరు 14: దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో పాముకాటుతో సెక్యూరిటీ గార్డు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. శుక్రవారం రాత్రి విధులు ముగించుకొని ఆరుగురు సెక్యూరిటీ గార్డులు బ్యారక్‌కు చేరుకొని నిద్రలోకి జారుకున్నారు. అర్ధరాత్రి ఏదో పాకుతున్నట్టు గమనించి ఉలిక్కిపడి లేచి చూడగా పాము కనబడింది. అందరూ నిద్ర లేచి పామును చంపేసి మళ్ళీ నిద్రపోయారు. అనంతరం శనివారం తెల్లవారుజామున చేదం నవీన్ (24) కడుపులో తిప్పుతుందని బాత్‌రూంకు వెళ్ళి అక్కడే కుప్పకూలి మృతి చెందాడు. మరో సెక్యూరిటీ గార్డు వైభవ్ దూబే నోటి నుంచి నురుగులు రావడాన్ని గమనించిన తోటి ఉద్యోగులు వెంటనే ఓరియంట్ డిస్పెన్సరీకి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. పాము ముందుగా చేదం నవీన్‌ను కాటేసి అనంతరం వైభవ్‌ను కాటేసి ఉంటుందని పేర్కొన్నారు. మృతుడు చేదం నవీన్ కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలానికి చెందినవాడు కాగా, వైభవ్ దూబే మహారాష్ట్రకు చెందిన వాడని తెలిపారు.

ఈ సందర్భంగా నాయకపోడు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్ది భార్గవ్, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల బాపు మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డులు నివాసం ఉండే బ్యారక్ వద్ద ఎలాంటి రక్షణ చర్యలు లేక పోవడంతో విష పురుగులు సంచరిస్తున్నాయన్నారు. సిబ్బంది భద్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఓరియంట్ కంపెనీ యాజమాన్యం నైతిక బాధ్యత వహించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘాల నాయకులు పల్లె చంద్రయ్య, కనకరాజు, హన్మంతు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన

బెల్లంపల్లి: దేవాపూర్‌లో పాము కాటుకు గురై మృతి చెందిన నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలని శనివారం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బాధిత కుటుంబ సభ్యులు, ఆదివాసీ సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. ఉదయం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చినప్పటికి సాయంత్రం వరకు పోస్టుమార్టం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. పాము కాటుకు గురైన నవీన్ కుటుంబ సభ్యులకు రూ.20 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆందోళనకు దిగారు. దీంతో అక్కడకు పోలీసులు, ఓరియంట్‌లో విధులు నిర్వహించే అధికారులు చేరుకొని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. రూ.8 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సింగరేణి కార్మికుడికి పాముకాటు

జైపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే 1ఏ గనికి చెందిన రాము అనే జనరల్ మజ్దూర్ కార్మికుడు పాముకాటుకు గురయ్యాడు. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం ఇందారం గోదావరి నది వద్ద ఏర్పాటు చేసిన షెల్టర్‌లో రివర్ గార్డుగా మొదటి షిఫ్ట్ విధులు నిర్వహిస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. సమాచారం తెలుసుకున్న అధికారులు వెంటనే సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు కార్మికులు పేర్కొన్నారు.

టీఎన్జీఓ హౌజింగ్ సొసైటీపై ఆరోపణలు అవాస్తవం


మాట్లాడుతున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు శ్రీహరి

మంచిర్యాల కలెక్టరేట్,సెప్టెంబర్ 14: టీఎన్జీవో హౌసింగ్ సొసైటీపై కొందరు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి అన్నారు.. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కలెక్టరేట్ రోడ్ లో 45 ప్లాట్లు రోడ్డు కింద పోయాయన్నారు. ఇప్పటి వరకు 30మందికి సర్దుబాటు చేశామన్నారు. మిగిలిన 15 మందికీ సర్దుబాటు చేస్తామన్నారు. నిర్మాణంలో ఉన్న 110 ప్లాట్‌లను లక్కీడ్రా ద్వారా కేటాయిస్తా మన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రూ.5 లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించడం సరికాదన్నారు. టీఎన్జీఓ నాయకులు మొండయ్య, హబీబ్‌హుస్సేన్, మురళీధర్, జాన్ డేవిడ్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

మండప నిర్వాహకుల సేవలు అభినందనీయం


మందమర్రిలో నిర్వాహకులను సన్మానిస్తున్న నల్లాల ఓదెలు, భీమారంలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

మందమర్రి టౌన్, సెప్టెంబరు 14: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణేష్ మండపాలను ఏర్పాటు చేసిన నిర్వాహకులు భక్తులకు అందించిన సేవలు అభినందనీయమని మాజీ విప్ నల్లాల ఓదెలు తెలిపారు. గణపతి మండప నిర్వాహకులను శనివారం మార్కెట్ సెంటర్లో సన్మానించారు. నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించాలన్నారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ఓదెలు, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రావు, హిందూ ఉత్సవ కమిటీ నాయకులు అనంతచార్యులు, కాంగ్రెస్ నాయకులు గుడ్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు. పాలచెట్టు ఏరియాలో గల గణేష్ మండపంలో నల్లాల పూజలు చేశారు.

గణనాథుడికి ఘనమైన పూజలు

దండేపల్లి: దండేపల్లి రామాలయం వద్ద ఏర్పాటు చేసిన మండపం వద్ద ఆర్యవైశ్యులు, మహిళలు కుంకుమార్చన పూజలో పాల్గొన్నారు. మండపాల వద్ద భజన, పలు సాంస్కృతీకకార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

భీమారం: మండల కేంద్రంలోని సాయి గణేష్ మండలితోపాటు వివిధ గణేష్ మండళ్ల వద్ద అన్నదానాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. సాయి గణేష్ మండలి వద్ద ఏర్పాటు చేసిన కుంకుమ పూజలో ప్రధాన అర్చకులు తిరుణగిరి కన్నయ్య ప్రత్యేక పూజలు చేశారు. శ్రీసాయి గణేష్ మండలి 1976లో ఏర్పాటు చేసిన నాటి నుంచి యేటా పూజలు చేస్తున్నామ న్నారు.

కన్నెపల్లి: జన్కాపూర్ అభయాంజనేయ స్వామి ఆలయంలోని గణేశుడి వద్ద 108 రకాల పిండి వంటలతో నైవేద్యాలను సమర్పించారు. పంచామృతాలతో అభిషేకం చేశా రు.


జన్కాపూర్‌లో గణేశుడి వద్ద 108 రకాల ప్రసాదాలతో భక్తులు

చెన్నూరు: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద పూజలు చేశారు.అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. హేమంత్ రెడ్డి, చెన్న సూర్యనారాయణ, మహేష్ తివారి, బాషాగౌడ్, అంకా గౌడ్, రాంరెడ్డి, పాల్గొన్నారు.

జన్నారం: వినాయకనగర్, రామ్‌నగర్, రేండ్లగూడ గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 రకాల ప్రసాదాలు సమర్పిం చారు.

రామకృష్ణాపూర్: భగత్‌సింగ్‌నగర్ గణేష్ మండలి వద్ద అర్చకులు వంశీ కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతును మోసగించిన ముగ్గురి అరెస్ట్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 14: కర్ణమామిడికి చెందిన రైతు బొడ్డు శేఖర్‌ను మోసగించిన ముగ్గురు వ్యక్తులను శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. గత నెలలో కార్తీక్ అనే వ్యక్తి ఎన్‌పీఎస్ కంపెనీ(భారత్ కిసాన్ వెల్ఫేర్ ఫౌండేషన్) మార్కెటింగ్ మేనేజర్‌గా శేఖర్‌కు పరిచయం చేసుకున్నాడు. 50శాతం సబ్సిడీతో ట్రాక్టర్ ఇప్పిస్తానని, జన్మభూమినగర్‌లో ఉన్న తమ కార్యాలయంలో కలవాలని చెప్పాడు. శేఖర్ కార్యాలయంలోని మేనేజర్ చంద్రమౌళి, అకౌంటెంట్ రత్నం శ్రీకాంత్‌ను కలిశాడు. ట్రాక్టర్ విలువ 6 లక్షల 40 వేలు కాగా, 50 శాతం సబ్సిడీ పోను మూడు లక్షల 20 వేలు అందజేశాడు. ట్రాక్టర్ డెలివరీ అనంతరం చంద్రమౌళి లక్ష 6 వేల 500లు డౌన్ పేమెంట్‌గా ఫైనాన్స్ కంపెనీ వారికి చెల్లించి శేఖర్ పేరిట లోన్ దరఖాస్తు చేశాడు. విషయం తెలుసుకున్న బాధితుడు శుక్రవారం మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సనత్‌కుమార్ చంద్రమౌళి, రత్నం, కార్తీక్‌ను అదుపులోకి తీసుకొని, కారు, మొబైల్ ఫోన్స్, రికార్డులను స్వాధీనం చేసుకొని బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేశారు. వారిని విచారించగా 88 మంది రైతుల వద్ద రెండు కోట్ల 70 లక్షల రూపాయలు రెండు నెలల కాలంలో వసూలు చేశారు. రైతుల డబ్బులనే రొటేషన్ చేస్తూ మోసగిస్తున్న ఖైరతాబాద్‌లోని ఎన్‌పీఎస్ చైర్మన్ కుమారస్వామి ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలిపారు. చంద్రమౌళి, రత్నం, కార్తీక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కాసిపేట, సెప్టెంబరు 14: విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం రాత్రి మల్కెపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థులు నిద్రించే గదులు వంటశాల, రిజిష్టర్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి నిద్రించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై పర్యవేక్షిస్తున్నామన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. తహసీల్దార్ భోజన్న, పంచాయతీ అధికారి సఫ్దర్ అలీ, ఏటీడీవో, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం


అవార్డు అందుకుంటున్న ఇప్ప పోచయ్య

రెబ్బెన, సెప్టెంబరు 14: మండలకేంద్రానికి చెందిన విశ్వశాంతి విద్యాలయం ప్రధానోపాధ్యాయుడు ఇప్ప పోచయ్యను ఆల్‌ఇండియా ప్రయివేటు స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి గాను ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తించి శనివారం అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంటు అసోసియేషన్(ట్రస్మా) రాష్ట్ర చీఫ్ అడ్వయిజర్ యాదగిరి, శేఖర్‌రావు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా విశ్వశాంతి విద్యాలయాన్ని నిర్వహిస్తూ ఎందరోవిద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దినందుకు గాను ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తించి అవార్డు అందజేశామన్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ యాదగిరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం

కాగజ్‌నగర్, సెప్టెంబరు 14: సిర్పూరు నియోజకవర్గ ఏడు మండలాల యువతకు ఉపాధి అవకాశం కల్పించేందుకు టాటాకంపెనీ వారు ఆదివారం సాయంత్రం 4గంటలకు కాగజ్‌నగర్‌లోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశానికి రిటైర్డ్ ఐపీఎస్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, తదితరులు హాజరుకానున్నారు.

మండలంలో సేవలు సంతృప్తినిచ్చాయి

బెజ్జూరు, సెప్టెంబరు 14: మండలంలో చేసిన సేవలు సంతృప్తినిచ్చాయని బదిలీపై వెళ్తున్న ఏవో రాజులనాయుడు అన్నారు. శనివారం మండలకేంద్రంలోని రైతువేదికలో బదిలీపైవెళ్తున్న రాజులనాయుడు, ఏఈవో రవితేజను ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్ అసోసియేషన్‌సభ్యులు సందీప్, అమీరుద్దీన్, భూపతి, శ్రీనివాస్, సతీష్, మహేష్, సాయిశ్రీనివాస్, విశ్వేశ్వర్,జావీద్ అలీ, తిరుపతి, అకీమ్ పాల్గొన్నారు.

దాడి కేసులో భార్యభర్తల రిమాండ్

చింతలమానేపల్లి, సెప్టెంబరు 14: మండలంలోని రవీంద్రనగర్-2లో ఈనెల 11న కృష్ణమండల్‌పై అతని తమ్ముడు పవిత్రమండల్, అతని భార్య ఉమ మండల్ కత్తితో దాడిచేశారు. దీంతో బాధితుడి భార్య హీరామండల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం భార్యభర్త పవిత్ర, ఉమపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ముందస్తు అరెస్టు

రెబ్బెన, సెప్టెంబరు 14: బీజేపీజిల్లాఅధికార ప్రతినిధి కేసరి అంజనేయులుగౌడ్‌ను శనివారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. జైనూరు మండలానికి వెళ్లుతున్నట్టు సమాచారం తెలుసుకొని తిర్యాణి ఎస్సై మాధవ్ ఉదయమే కేసరి అంజనేయులుగౌడ్ ఇంటికి చేరుకొని అదుపులోకి తీసుకున్నారు. అలాగే బీజేపీ మండల ప్రధానకార్యదర్శి నవీన్‌గౌడ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు.

గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

కాగజ్‌నగర్, సెప్టెంబరు 14: గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని పట్టణ సీఐ శంకరయ్య అన్నారు. శనివారం రాయల్‌గార్డెన్స్‌లో మండపాల నిర్వాహకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల17న పట్టణంలో గణేష్ నిమజ్జనం జరుగుతుందని తెలిపారు. ఇందుకు ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. నిమజ్జానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవసమితిసభ్యులు, బజరంగ్‌దళ్‌సభ్యులు, మున్సిపల్, రెవెన్యూఅధికారులు, ఎస్సైలు సుధాకర్, మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ మండపాల్లో అన్నదానాలు, కుంకుమ పూజలు


ఆసిఫాబాద్‌లో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు


కాగజ్‌నగర్‌లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 14: జిల్లాకేంద్రంలోని ఆయాగణేష్‌మండపాల వద్ద శనివారం అన్నదాన కార్యక్రమాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాపునగర్, బ్రాహ్మణవాడ,బజార్‌వాడ, సాయినగర్, సిద్ధివినాయక నగర్,హడ్కోకాలనీల్లో అన్నదాన కార్యక్రమాలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్, నిర్వహణ కమిటీసభ్యులు గీత,మంగ, వివేక్, విలాస్, సుగుణాకర్, మహేందర్, శ్రీనివాస్, ఆనంద్,సాయి, రాజు, కరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: పట్టణంలో గణేష్ మండపాల్లో శనివారం కుంకుమపూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయాకమిటీల సభ్యులు, భక్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: మండలంలోని డబ్బా, కర్జవెల్లి గ్రామాల్లో వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం కుంకుమార్చన, యజ్ఞాలు నిర్వహించారు. గణనాథుడికి పూజానంతరం మహిళలు ప్రత్యేకపూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. కర్జవెల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయకమండపాల వద్ద హోమం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీ బాపుకాలనీలో వైద్యశిబిరం


వైద్యశిబిరానికి హాజరైన రోగులు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 14: కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి సీ బాపుకాలనీలో శనివారం స్వర్ణఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ భానుప్రకాష్, సిబ్బంది రోగులకు పరీక్షలు నిర్వ హించారు. అనంతరం మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యచికిత్సలు అందించిన డాక్టర్‌ను హెల్పింగ్‌హ్యాండ్స్ బృందసభ్యులు ఘనంగా సన్మానించారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 14: తెలంగాణ టీపీసీసీ అధ్యక్షుడు నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి శాలు వాతో సన్మానించారు. జిల్లాలోని పరిస్థితులను ఆయనకు వివరించారు. ఆయనవెంట నాయకులు అనిల్‌గౌడ్, తదితరులు ఉన్నారు.


పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు



జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

వార్షికోత్సవాలను విజయవంతం చేయండి

బెల్లంపల్లి, సెప్టెంబరు 14: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్స వాలను ఈనెల17వ తేదీ వరకు నిర్వహిస్తామని, విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు మిట్టపల్లి వెంకటస్వామి అన్నారు. శనివారం రడగంబాల బస్తీలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధులు శంకర్‌రావు రామకృష్ణశాస్త్రీ సేవలు మరువలేనివన్నారు. నాటి యోధుల వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఆడెపు రాజమౌళి, ఉదయ్, ప్రభుదాస్, దుర్గయ్య, రాజేష్, రాంచందర్‌లు పాల్గొన్నారు. పట్టణంలోని రడగంబాల బస్తీలో ఉన్న సీపీఐ జెండా ఆవిష్కరణ చేశారు.

ధర్నాను విజయవంతం చేయండి

కౌటాల, సెప్టెంబరు 14: భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీంల ఇన్సురెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని, ప్రభుత్వం ద్వారానే సంక్షేమపథకాలను కార్మికులకు అందించాలని ఈనెల23న తలపెట్టిన చలో లేబర్‌కమిషనర్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. లేబర్ కమీషనర్ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాలో భవన నిర్మాణ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమాచారి, విఠల్, శేఖర్, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రంథ పఠనం

వాంకిడి, సెప్టెంబరు 14: మండలకేంద్రంలోని జేతవన్ బుద్ధవిహార్‌లో బుద్ధఅండ్‌ధమ్మ గ్రంథపఠన కార్యక్రమం కొనసాగుతోంది. ఆషాడపౌర్ణమి నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం శనివారం 72వరోజుకు చేరుకుంది. మండలంలోని ఖమానగ్రామంలోని బుద్ధ విహార్‌లోనూ గ్రంథపఠన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మూడునెలలపాటు నిర్వహించే ఈకార్యక్రమంలో పెద్దసంఖ్యలో ప్రజలు హాజరై సద్వినియోగం చేసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జైరామ్ ఉప్రే కోరారు.

మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుల బదిలీ

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 14: జిల్లాకేంద్రంలోని తెలంగాణ ఆదర్శపాఠశాల ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ప్రిన్సిపాల్ అబ్దుల్‌కలీల్‌తోసహా ఉపాధ్యాయులు రాకేష్, శంకర్, ప్రవీణ్, భాగ్యశ్రీ మంచిర్యాల జిల్లా కాసిపేటకు బదిలీ కాగా ఉపాధ్యాయులు సంపత్, వరలక్ష్మి, స్వరూప మందమర్రికి, మహేష్ కోటిపల్లికి, రమేష్ దండెపల్లికి, రేష్మాపర్వీన్ రామగుండంకు,శోభ మంచిర్యాలకు బదిలీఅయ్యారు. ఆసిఫాబాద్ పాఠశాలకు దండెపల్లికి చెందిన పీజీటీ మహేశ్వర్, ధర్మారంకు చెందిన టీజీటి ఫర్వీన్ బదిలీపై వచ్చారు.

వంట గ్యాస్ సబ్సిడీ పత్రాల అందజేత

భీమిని/తాండూర్/బెల్లంపల్లి రూరల్, సెప్టెంబరు 14: భీమిని, బెల్లంపల్లి మండలకేంద్రాల్లో, తాండూర్ మండలంలోని అచ్చలాపూర్, మాదారం గ్రామాల్లో మహాలక్ష్మీగ్యాస్ పథకం పత్రాలను అధికారులు శనివారం అందజేశారు. కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, తాండూర్ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీప్రకారం అన్నీ ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. బెల్లంపల్లి మండలంలో 3986సబ్సిడీ పత్రాలు మంజూరు కాగా ఇప్పటివరకు 1555పత్రాలను లబ్ధిదారులకు అందించినట్లు ఎంపీడీవో మహేందర్ తెలిపారు. భీమినిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో గంగామోహన్, మండల అధ్యక్షుడు గాధం లక్ష్మీనారాయణ, కార్యదర్శి సత్యనారాయణ రాజు, నాయకులు ప్రసాద్, నవీన్, తాండూరులో మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్‌రావు, మాజీ జడ్పీటీసీ బండి పోచం, మాజీ సర్పంచు శంకరమ్మ పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 14: కాగజ్‌నగర్ కాపువాడలో పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ శంకరయ్య, ఎస్సై సుధాకర్ తెలిపారు. శనివారం ముందస్తు అందించిన సమాచారం మేరకు కాపువాడలో దాడులు చేసినట్టు తెలిపారు. వారివద్ద నుంచి రూ.4550 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.



కూరగాయల వ్యాపారులు అగ్రిమెంట్ చేసుకోవాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు 14: కూరగాయల మార్కెట్ భవనంలో స్టాల్స్ కేటాయింపు జరిగిన వ్యాపారులు ఈ నెల 16లోగా అగ్రిమెంట్ చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. స్టాల్స్ దక్కించుకున్న వ్యాపారులు రూ.పది వేలు డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. అగ్రిమెంట్ చేయించుకోకుంటే స్టాల్స్‌ను ఇతరులకు కేటాయిస్తామని పేర్కొన్నారు. నూతన కూరగాయల మార్కెట్ ప్రారంభమైన తర్వాత ఎవరు కూడా రోడ్డు పక్కన కూరగాయలు అమ్మవద్దని, ఎవరైనా అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు.

ఎట్టకేలకు సాకారం..



- మోడల్ స్కూళ్లలో బదిలీలకు మోక్షం
- తెల్లారే వరకు వెలువడిన ఉత్తర్వులు
- పుష్కరకాలం అనంతరం మార్గం సుగమం
- ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో చేజారిన అవకాశం

మంచిర్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలల్లో ఉపాధ్యాయుల బదిలీల కల ఎట్టకేలకు సాకారమైంది. బదిలీల కోసం పుష్కర కాలంగా ఎదురు చూస్తుండగా కోర్టు, ప్రభుత్వం చొరవతో మోక్షం లభించినట్లయింది. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్యను ఆంగ్ల మాధ్యమంలో అందించే లక్ష్యంతో 2012లో కేంద్ర ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసింది. పాఠశాలల పర్యవేక్షణ కొంతకాలం తన పరిధిలోనే ఉంచుకున్న కేంద్రం అనంతరం రాష్ట్రాలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. అయితే మోడల్ స్కూళ్ల ప్రారంభమై 12 సంవత్సరాలు కావస్తున్నా వాటిలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు ఇంతకాలం బదిలీలకు నోచుకోలేదు. పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుంచి ఒకే చోట విధులు నిర్వహించాల్సి రావడం, పూర్తి స్థాయిలో మార్గదర్శకాలు అమలు కాకపోవడంతో కొంత ఇబ్బందికర పరిస్థితుల్లో విధులు నిర్వహించాల్సి వచ్చింది.

తెల్లవారేసరికి వెలువడిన బదిలీ ఉత్తర్వులు

మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ప్రిన్సిపాల్, ఇతర ఉపాధ్యాయుల బదిలీలకు తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఎక్స్‌అఫీషియో ప్రాజెక్టు డైరెక్టర్ ఈ నెల 13న రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల్లో ఇంతకాలం కోర్టు కేసుల కారణంగా జాప్యం జరుగగా, ఈ సారి ఆ అవకాశం లేకుండా రాత్రికి రాత్రే జీవో విడుదల చేస్తూ వెంటనే అమలుచేశారు. దీంతో శనివారం ఉదయం బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. పని చేస్తున్న స్థలంలో రిలీవై తక్షణమే కొత్త ప్లేస్‌లో విధుల్లో చేరాల్సి వచ్చింది. జిల్లాలో దండేపల్లి, మంచిర్యాల, మంద మర్రి, కాసిపేట, కోటపల్లి మండలాల్లో మోడల్ స్కూళ్లు ఉన్నాయి. దండేపల్లి మండలంలోని లింగాపూర్, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో సిబ్బంది ఉండగా, మిగతా మూడు చోట్ల ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లు, అవర్లీ బేస్డ్ టీచర్లు విధుల్లో ఉన్నారు. ప్రస్తుతం బదిలీలు చేపట్ట డంతో అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేరే అవకాశం ఉంది.

ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో ఇబ్బందులు....

ఆగమేఘాల మీద ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టిన ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్, స్పౌజ్ పాయింట్లను పరిగణలోకి తీసుకోకపోవడం వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. ఎడిట్ ఆప్షన్ విషయంలో 13 నెలల క్రితం తీసుకున్న వాటినే ప్రస్తుత బదిలీల్లో అమలు చేశారు. దాదాపు సంవత్సరం గడవడంతో ఈ లోగా ఇతర డిపార్ట్‌మెంట్లలో ప్రభుత్వం బదిలీలు చేపట్టింది. అనేక చోట్ల ఖాళీలు ఏర్పడాయి. ఒకవేళ ప్రభుత్వం మళ్లీ ఎడిట్ ఆప్షన్‌కు అవకాశం ఇచ్చి ఉంటే ఉపాధ్యాయులు తమకు అనుకూలమైన ప్రాంతాలను ఎంచుకొని ఉండేవారు. హడావుడిగా బదిలీలు చేపట్టడంతో ఆ అవకాశం దక్కకుండా పోయింది. తద్వారా స్పౌజ్ పాయింట్లను ప్రభుత్వం పరిగణనకు తీసుకోలేదు. స్పౌజ్ పాయింట్లను పరిగణలోకి తీసుకుంటే బదిలీల్లో అదనపు మార్కులు కలిసి ఒక చోటికి బదిలీపై వెళ్లేవారు. ప్రభుత్వం పై రెండు అంశాలను పరిగణలోకి తీసుకోకపోవడం ద్వారా జిల్లాలో పది మందికి కోరుకొనే చోటుకు బదిలీపై వెళ్లలేకపోయారు.

అయోమయంలో హెచ్‌బీటీలు...

ప్రభుత్వం బదిలీలు చేపట్టడంతో ఇంతకాలం మోడల్ స్కూళ్లలో పని చేసిన హెచ్‌బీటీల పరిస్థితి అయోమయంలో పడింది. బదిలీల్లో భాగంగా అన్ని మోడల్ స్కూళ్లకు రెగ్యులర్ ఉపాధ్యాయులు రానున్నారు. దీంతో హెచ్‌బీటీలు ఉన్నపలంగా విధుల నుంచి తప్పుకోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. 2016 నుంచి జిల్లా వ్యాప్తంగా 70 మంది వరకు అవర్లీ బేస్డ్ టీచర్స్ పని చేస్తున్నారు. రోజుకు ఇన్ని గంటలంటూ విధులు నిర్వహించే వారికి రెగ్యులర్ టీచర్ల రాకతో ఉపాధి కోల్పోవలసి వచ్చింది. దీంతో వారంతా తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. తమను కనీసం కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పరిగణించాలని సంవత్సరాల తరబడి హెచ్‌బీటీలు పలు రకాలుగా ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. అయినా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో రోడ్డున పడాల్సి వచ్చింది. ఆదే పక్క రాష్ట్రమైన ఆంధ్ర ప్రదేశ్‌లో నాలుగేళ్ల క్రితం అక్కడి ప్రభుత్వం హెచ్‌బీటీ లను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పరిగణించి మినిమం టైమ్ స్కేల్ విధానాన్ని అమలు చేస్తోంది. దీంతో హెచ్ బీటీలకు ఉద్యోగ భద్రత కల్పించినట్లయింది. అయితే తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో హెచ్‌బీటీలంతా అయోమయంలో పడ్డారు.

ప్రభుత్వ నిర్ణయంతో సొంత జిల్లాకు వెళ్లాను

ఎతిరాజు రాజు, లింగాపూర్ ఉపాధ్యాయుడు




రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు చేపట్టడంతో దాదాపు 12 సంవత్సరాల తరువాత సొంత జిల్లాలో విధులు నిర్వహించే అవకాశం దక్కింది. నిర్మల్ జిల్లాకు చెందిన నేను దండేపల్లి మండలం లింగాపూర్ మోడల్ స్కూళ్లో పీజీటీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇంతకాలం కుటుంబానికి దూరంగా ఉంటున్న బాధ ఉండేది. ఎట్టకేలకు నిర్మల్‌లోని కుంటాలకు పోస్టింగ్ రావడంతో ఆనందంగా ఉంది.

తలసేమియా వ్యాధిగ్రస్తులు పరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న తలసేమియా శ్రీనివాస్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 14: తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వ్యాధిగ్రస్తులకు డీఎన్ఏ పరీక్షలు ప్రారంభించారు. అయన మాట్లాడుతూ జన్యు సంబంధిత డీఎన్ఏ పరీక్షలు చేసుకోవాలని, ఆరోగ్యశ్రీ పథకంతోపాటు, సదరం సర్టిఫికెట్లు పొందవచ్చనన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ ఎంసి మెంబర్ మధుసూదన్‌రెడ్డి, ట్రాన్స్‌షన్ సెంటర్ ఇన్‌చార్జి కాసర్ల శ్రీనివాస్, సత్యపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 14: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని పెద్దపల్లి పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి తలారి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలు మారుస్తూ బీఆర్ఎస్‌లో చేరి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన చంద్రబాబుపై అవాకులు, చవాకులు పేలడం దారుణమన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు డైరెక్షన్‌లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నాడని అనడం సరైంది కాదన్నారు. కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక సాయం

జైపూర్, సెప్టెంబరు 14: 1999-2000 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు నెన్నెల మండల కొత్తూరుకు వెళ్లి రూ.20 వేల ఆర్థిక సహాయం చేశారు. ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న స్నేహితుల కుటుంబాలకు ఇస్తున్నామని పేర్కొన్నారు.శ్రీనివాస్ గౌడ్, రమేష్, వెంకట స్వామి, తిరుపతి, తుల సీరామ్, వేణు పేర్కొన్నారు.

ఓటరు జాబితా నమోదు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి



దేవాపూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

కాసిపేట, సెప్టెంబరు 14: గ్రామ పంచాయతీ సాధారణ ఓటరు జాబితా నమోదు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే బీఎల్‌వోలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం దేవాపూర్ గ్రామపంచాయతీలో కలెక్టర్ పర్యటించారు. ఐదుగురు బీఎల్‌వోల పనితీరు సరిగ్గా లేక పోవడం, బీఎల్‌వోల ఓటరు జాబితా యాప్‌లో నమోదు ప్రక్రియలో పురోగతి లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేపట్టి పేర్ల నమోదులో నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారన్నారు. ఇదే విధానం కొనసాగితే ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. అక్టోబరు 18 లోగా ఓటరు జాబితా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రభుత్వం అందించే అభయహస్తం రూ.500లకే గ్యాస్ సిలెండర్ కార్డును లబ్ధిదారులకు అందజేశారు. అర్హులైన లబ్ధిదారులు అందరూ రేషన్ డీలర్ల వద్ద కార్డులు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ బోజన్న, కార్యదర్శి కవిత, మాజీ ఎంపీటీసీలు మేరుగ పద్మశంకర్, రాజమౌళి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, స్థానిక నాయకులు షాకీర్, చంటీ, షైదం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సర్వేను పరిశీలించిన కలెక్టర్

బెల్లంపల్లి: పట్టణంలో కలెక్టర్ కుమార్‌దీపక్ ఓటరు జాబితా సర్వేను పరిశీలించారు. ఇంటింటా ఓటరు జాబితా సమగ్ర సర్వే జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. పట్టణంలోని 86వ బూత్‌లో ఓటరు జాబితాకు సంబంధించి బూత్ లెవల్ ఆఫీసర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది ఇండ్లలో ఓటర్లు ఉన్నారని, ఎన్ని ఇండ్లు సర్వే పూర్తి చేశారని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ సిబ్బంది, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న శ్యాంసుందర్‌రావు, నాయకులు


బెల్లంపల్లి, సెప్టెంబరు 14 : బీజేపీ బలోపేతానికి యువతతోపాటు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ నాయకుడు శ్యాంసుందర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నరేంద్ర మోదీ నాయకత్వాన్ని దేశ ప్రజలు విశ్వసించారని, అన్ని వర్గాల ప్రజలు యువత సభ్యత్వం తీసుకోవాలన్నారు. పట్టణంలోని వ్యాపారులు బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ ఎనగందుల కృష్ణమూర్తి, కోకన్వీనర్ శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యాల ఏమాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేష్, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, అసెంబ్లీ కో కన్వీనర్ రాజులాల్ యాదవ్, మండల అధ్యక్షుడు రామన్న యాదవ్, బుడిమే విజయ్ పాల్గొన్నారు.

దేశ రక్షణ కోసం బీజేపీలో చేరండి

తాండూర్: దేశ రక్షణ, శ్రేయస్సు కోసం బీజేపీ పని చేస్తోందని, ప్రజలు అందరూ పార్టీలో చేరాలని సీనియర్ నాయకులు గోనె శ్యాంసుందర్ రావు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. ప్రజలు బీజేపీని విశ్వసించి నరేంద్ర మోదీని మూడు సార్లు ఎన్నుకున్నారని అన్నారు. మండల అధ్యక్షుడు దూడపాక భరత్ కుమార్, ఎనగందుల కృష్ణమూర్తి, శ్రీకృష్ణదేవరాయలు, కొయ్యాల ఏమాజీ, అమురాజుల శ్రీదేవి, పులగం తిరుపతి, గోవర్ధన్, బిలువేరు శేఖర్, పుల్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.







రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

లక్సెట్టిపేట రూరల్, సెప్టెంబరు 14: పట్టణంలోని మహాత్మ జ్యోతిబాఫూలే పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్ తెలిపారు. ఈ నెల 13న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి వివిధ క్యాటగిరీల్లో 12 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఈనెల 18, 19 తేదీల్లో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర పోటీ ల్లో పాల్గొంటారని వివరించారు. పీడీ నాంపల్లి, పీఈటీ రాజేష్‌లను అభినందించారు.

చెన్నూరు: రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మహాత్మ జ్యోతిబాపులే విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రకాష్ తెలిపారు. అండర్-18 100 మీటర్ల పరుగు పందెంలో ప్రశాంత్ ప్రథమ, అండర్-18 లాంగ్ జంప్, హైజంప్‌లో ఆర్.శ్రావణ్‌కుమార్ ప్రథమ, ద్వితీయ, జావెలింగ్‌త్రోలో ఎ.అజయ్ ద్వితీయ, అండర్-14 600 మీటర్ల పరుగు పందెంలో రిజిత్ ద్వితీయ, లాంగ్ జాంప్‌లో ప్రథమ స్థానాన్ని సాధించారు. లాంగ్ జంప్‌లో మణికంఠ ప్రథమ, షార్ట్‌పుట్‌లో ద్వితీయ స్థానాన్ని సాధించారు. పీఈటీ విజయ్‌ను అభినందించారు.

సాగు నీరు వృథా

- కాలువలో పేరుకుపోయిన చెత్త
- రోడ్డుపై పారిన నీరు



రహదారిపై వృథాగా పోతున్న నీరు

దండేపల్లి, సెప్టెంబరు 14: కడెం ప్రాజెక్టు ద్వారా ఆయకట్టుకు విడుదల చేసిన నీరు రోడ్డు పాలైంది. శనివారం ఉదయం మండల కేంద్రంలోని ఆంధ్రాకాలనీ సమీపంలో 28వ డిస్ట్రిబ్యూటరీ కాలువలో చెత్తాచెదారం తట్టుకొని నీరు నిలిచింది. క్రమంగా రాష్ట్రీయ రహదారిపై పారుతూ చెరువును తలపించింది. అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఐదు గంటల అనంతరం డిస్ట్రిబ్యూటరీ వద్ద గేట్‌వాల్వ్‌ను కిందికి దించడంతో నీటి ప్రవాహం తగ్గింది. దీంతో రహదారిపైకి నీరు రాకుండా నిలిచిపోయాయి.

